గద్దర్ జయంతి వేడుకలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్‌ఎఫ్) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, బహుజన నాయకుడు ధనుంజయ్, మున్సిపల్ కౌన్సిలర్, అమృత సత్తయ్య ఎడ్యుకేషనల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొల్లూరి భరత్, బీఎస్‌ఎఫ్ నాయకులు, సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సమస్య రానివ్వం

డీఈ శ్యామ్‌కుమార్



విద్యుత్ సరఫరాపై సమీక్ష చేస్తున్న డీఈ శ్యామ్ కుమార్

గచ్చిబౌలి: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఏర్పాట్లు చేస్తున్నామని డీఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. శనివారం ఏడీఈ, ఏఈలతో ఆయన సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 21.94 కోట్ల వ్యయంతో 11 కేవీ లైన్ల విభజన చేస్తామన్నారు. అలాగే కొత్త లైన్లను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ ఏడీఈలు కమలాకర్ రెడ్డి, మాణిక్యం, ఏఈలు కిశోర్, రంగారెడ్డి రాకేష్, భీమలింగం, విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



వేడుకలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

చందానగర్: చందానగర్‌లోని ప్రజ్ఞ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఎస్ఎన్ గార్డెన్స్‌లో శనివారం ఘనంగా జరిగింది. కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించడంలో ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ముందు వరుసలో ఉందన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు ఆటపాటలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగించ వద్దంటూ..

- బైక్‌ర్యాలీ.. కూడళ్ల వద్ద పోస్టర్లతో అవగాహన



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించిన డీసీపీ వినీత్

రాయదుర్గం: డ్రగ్స్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ శ్రీకృష్ణయూత్ ప్రచారానికి శ్రీకారం చుట్టింది. శనివారం ఐటీకారిడార్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ, మాదాపూర్ వరకు బైక్ ర్యాలీని నిర్వహిస్తూ ఆయా కూడళ్ళలో పోస్టర్ల ప్రదర్శన చేశారు. అంతకుముందు మాదాపూర్ డీసీపీ వినీత్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరింపచేశారు. శ్రీకృష్ణయూత్ చొరవను ఆయన అభినందించారు. అనంతరం బయోడైవర్సిటీ కూడలి, దాబా కూడలి, రాయదుర్గం, మైండ్ స్పేస్, హైటెక్‌సిటీ, శిల్పారామం కూడళ్ల వద్ద డ్రగ్స్ వినియోగం వద్దంటూ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, నాయకులు రోహిత్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, సంగమేష్, దేవేందర్, సందీప్, గోపాల్, ఏయిజాజ్, బాబు, సంతోష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన గంగాధరరావుకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదలైన 2 లక్షల 50 వేల రూపాయల చెక్కును శనివారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. విమల, స్వప్న పాల్గొన్నారు.



మొక్కుబడిగా కొన్ని పనులు చేపట్టి ..

- నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాలలో నాలుగు తరగతి గదులతో కూడిన గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌ను టీఎస్ఐఐసీ, ఇతర సంస్థల సహకారంతో నిర్మించారు.
- కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణ, పరిశుభ్రతకు వలంటీర్లను ఏర్పాటు చేశారు.
- నానక్‌రాంగూడలోని మేడికుంటను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని జీహెచ్‌ఎంసీ, నీటిపారుదలశాఖ చెప్పినా, ఇప్పటివరకు పనులు చేయలేదు.
- జీహెచ్‌ఎంసీ ద్వారా ఆయా బస్తీలలో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చడంతో బాటు ఇతర సౌకర్యాలు కొన్ని కల్పించారు. టీఎస్ఐఐసీ, ఐటీ, ఇతర సంస్థలు చుట్టూరా ఉండే ప్రాంతాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



నానక్‌రాంగూడలోని ప్రధానరోడ్డు, అంతర్గత రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ

ఏదీ సోషల్ రెస్పాన్స్ ?

ఐటీ కంపెనీలు, ఇతర సంస్థలు, టీఎస్ఐఐసీ, ఐలా సంస్థలు మౌలిక వసతుల కల్పనకు చేయూత ఇవ్వాలి

రాయదుర్గం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చుట్టూరా ఉన్న కాలనీలు, బస్తీలను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. ఐటీ, ఇతర సంస్థలకు సీఎస్‌ఆర్ నిధులున్నా మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదని చుట్టుపక్కల ప్రాంతాల వారు అభిప్రాయపడుతున్నారు. చుట్టూరా ఉండే గ్రామాల ప్రైవేటు, ప్రభుత్వ భూములనుప్రభుత్వం గతంలో ఏపీఐఐసీ, ప్రస్తుతం టీఎస్ఐఐసీ ద్వారా తీసుకొని వాటిల్లో ఐటీ, ఆర్థిక, శిక్షణ, ఇతర సంస్థల ఏర్పాటునకు భూములను కేటాయించింది. దీంతో వేలం ద్వారా టీఎస్ఐఐసీకి భారీ ఎత్తున నిధులు సమకూరాయి. ఐటీ, ఇతర సంస్థలు ఏర్పాటైన చోటే భారీస్థాయిలో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించారు. కానీ భూములు కోల్పోయిన బస్తీల అభివృద్ధి మరిచారు.

ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చుట్టూరా ఉండే కాలనీ, బస్తీలు ఇవే..

నానక్‌రాంగూడ, రాయదుర్గం, గచ్చిబౌలి, గోపన్‌పల్లి ఐటీ కారిడార్, నానక్‌రాంగూడ.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల చుట్టూరా ఉండే కాలనీలు, బస్తీలలో మధురానగర్, ఖాజాగూడ, గౌలిదొడ్డి, కేశవనగర్, గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండా, ఎన్టీఆర్‌కాలనీ, తాజ్‌నగర్‌లు ఉన్నాయి.

మొక్కుబడిగా కొన్ని పనులు చేపట్టి ..

- నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాలలో నాలుగు తరగతి గదులతో కూడిన గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌ను టీఎస్ఐఐసీ, ఇతర సంస్థల సహకారంతో నిర్మించారు.
- కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణ, పరిశుభ్రతకు వలంటీర్లను ఏర్పాటు చేశారు.
- నానక్‌రాంగూడలోని మేడికుంటను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని జీహెచ్‌ఎంసీ, నీటి పారుదలశాఖ చెప్పినా, ఇప్పటివరకు పనులు చేయలేదు.
- జీహెచ్‌ఎంసీ ద్వారా ఆయా బస్తీలలో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చడంతో బాటు ఇతర సౌకర్యాలు కొన్ని కల్పించారు. టీఎస్ఐఐసీ, ఐటీ, ఇతర సంస్థలు చుట్టూరా ఉండే ప్రాంతాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

డిమాండ్ చేస్తున్న చుట్టుపక్కల బస్తీలు, కాలనీవాసులు

కల్పించాల్సిన సౌకర్యాలివే..

- టీఎస్ఐఐసీ, ఐటీ, ఇతర సంస్థలు ఒక్కో ప్రాంతాన్ని దత్తత తీసుకోవాలి. సీఎస్‌ఆర్ నిధులతో దశలవారీగా ఒక్కోచోట సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పర్చడం, చెరువులను సుందరీకరించడం, ఇతర సౌకర్యాలు కల్పించాలి.
- ప్రతి ప్రాంతానికి పూర్తిస్థాయి భూగర్భ డ్రైనేజీ ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలి
- ఆధునిక హంగులతో కమ్యూనిటీ కమ్ మ్యారేజ్ హాల్, బస్టాపులు, వేవ్ రాక్ వద్ద బస్టాండు నిర్మించాలి
- స్థానికులకు ఉపాధి కల్పించాలి. అత్యాధునిక స్థాయిలో అన్నిచోట్లా గ్రంథాలయం ఏర్పాటు చేయాలి
- అంతర్గత రోడ్లను సీసీరోడ్లు, ప్రధాన రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలి
- ప్రస్తుతం ఉన్న నానక్‌రాంగూడ, మధురానగర్, గౌలిదొడ్డిలోని ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలి
- చుట్టూరా ఉండే ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి
- ప్రస్తుతమున్న శ్మశానవాటికలను ఆధునికీకరించాలి
- నానక్‌రాంగూడలో బస్తీదవాఖానాను ఏర్పాటు చేయాలి. ఈ దిశగా ఆయా సంస్థలు చర్యలు తీసుకుంటే మేలు చేకూరుతుంది.



గాలిదొడ్డిలో..

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యావేత్తలు కీలకం

- హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు
- 'యూజీసీ స్వయం వర్క్‌షాప్–2025' ప్రారంభం



యూజీసీ స్వయం వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రొ.బీజేరావు


రాయదుర్గం: దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యావేత్తలదే కీలకపాత్ర అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని సావిత్రీబాయిపూలే ఆడిటోరియంలో శనివారం దక్షిణ భారత దేశంలో యూనివర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలల్లో 'స్వయం కోర్సుల ఏకీకరణ, అమలు' అనే అంశంపై యూజీసీ స్వయం వర్క్‌షాప్–2025 కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యావేత్తలంతా విద్యావిధానంను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పి ఉమామహేశ్వరిదేవి మాట్లాడుతూ యూజీసీ మార్గదర్శకాలను అనుసరించడం, స్వయం కోర్సులను అమలు చేయడంలో రాష్ట్రాల చొరవను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. యూజీసీ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ దీక్షా రాజ్‌పుత్ మాట్లాడుతూ స్వయం కోర్సులను ప్రోత్సహించాలన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులతోపాటు డేటా క్యూరేషన్, డేటా టెక్నాలజీతో సహా డేటా సంబంధిత కోర్సులు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయన్నారు. ఐఐటీ మద్రాస్‌ను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో స్వయం ప్లస్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీటీఈఎల్ సీనియర్ సైంటిస్ట్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ డాక్టర్ జయకృష్ణన్, బెంగళూరు ఐఐఎం ప్రొఫెసర్ వాసంతి శ్రీనివాసన్, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దేవేష్‌నిగమ్, వర్క్‌షాప్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ వైభవ్‌విందల్, ప్రొఫెసర్ సుబ్బారావు ప్రసంగించారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, అండమాన్, నికోబార్ యూనివర్సిటీలు, వాటి అనుబంధ ఉన్నత విద్యా సంస్థల అధిపతులు, ప్రొఫెసర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవం

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవంలో శనివారం గురుకులం విద్యార్థులు, గురువిదూషి, పోపూరి తులసి శిష్యబృందంచే పంచరత్న కీర్తనలతో సందర్శకులను అలరించారు. విదుషి లలిత మాదవ్ భమిడిపాటి తన గాత్రంతో ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై దుర్గాభవాని, మృదంగంపై జయభాస్కర్, ఘటంపై రాహుల్ సుందర్ కస్తూరి సంగీత సహకారాన్ని అందించారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం సుమాంజలి నాట్యాలయ బృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో మహా గణపతిం, కొమ్మలారా, జతిస్వరం, గరుడగమన తదితర అంశాలను కళాకారులు ధనస్వీ, వేదన్వి, శాన్వి, భవిష్య, నేహ, హాసిని, లిఖిత తదితరులు పాల్గొని ప్రదర్శించారు.





శబరిమోక్షం నాటక ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో నిర్వహిస్తున్న రామాయణ కల్పవృక్షంలో భాగంగా శనివారం శబరిమోక్షం నాటక ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. కళాచరణ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. వాల్మీకి రామాయణంలోని పలు శ్లోకాలను వివరించారు.

రక్తదాన శిబిరాలు నిర్వహిస్తాం

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా నగరానికి చెందిన కిస్నా డైమండ్ జ్యూయలరీ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటిదాకా ఇనార్బిట్ మాల్, శరత్‌సిటీ మాల్స్‌లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు సంస్థ ఎం.డి ఘనశ్యామ్ ధోలాకియా తెలిపారు. రోటరీ చల్లా బ్లడ్ బ్యాంక్ బృందం రక్తాన్ని సేకరించిందని వివరించారు. ఇకపై క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయానికి లక్ష విరాళం

పటాన్‌చెరు: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ పృథ్వీరాజ్ అన్నారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవాలయానికి ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ పృథ్వీరాజ్ రూ.లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షుడు రఘు, మాజీ వార్డ్ మెంబర్ యాదగిరి, సభ్యులు పృధ్వీరాజ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు మధు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్, కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ భీమునికుంట, అలీతలాబ్ చెరువుల్లో శనివారం ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు సిబ్బందితో కలిసి దోమల నివారణకు ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్ వేశారు. చెరువులో, నాలాల్లో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు వేయవద్దన్నారు.చెత్తను ఉదయం మన ఇళ్ల వద్దకు వచ్చే ఆటోకు ఇవ్వాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గాంధీ



రేగులకుంట చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను సుందరీకరించి మంచి వాతావరణం అందించేందుకు కృషిచేస్తానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో రేగులకుంట చెరువు సుందరీకరణలో భాగంగా రూ.60లక్షలతో చేపడుతున్న మురుగు నీటి మళ్లింపు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత కొన్ని సంవత్సరాలుగా రేగుల కుంట చెరువులో మురుగునీరు చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, మురుగునీటి మళ్లింపుతో చెరువు దశ మారనుందన్నారు. చెరువు చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు ,పచ్చదనం, పిల్లల ఆటవస్తువులను ఏర్పాటు చేస్తామన్నారు.

యువ ఆవిష్కర్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలి

ప్రొ.సంజయ్ సుభోద్



నమూనాలను పరిశీలిస్తున్న అతిథులు

రాయదుర్గం: విద్యార్థుల సృజనాత్మకతకు విద్యవైజ్ఞానిక ప్రదర్శనలు అద్దం పడతాయని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, ప్రొఫెసర్ సంజయ్‌సుభోద్ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో శనివారం సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలుగా ఎదిగేలా విద్యార్థులను పాఠశాల స్థాయిలోనే ప్రోత్సహించాలన్నారు. చదువుతో వారు వినూత్నంగా ఆలోచించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన 85 ఎగ్జిబిట్ల గురించి విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మిరాజ్‌ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు.. నిరంతర ప్రక్రియ

శంషీగూడ వార్డు కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలి



దరఖాస్తు ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ వార్డు కార్యాలయంలో నూతనంగా స్వీకరిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల ప్రక్రియను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు, ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్నా ఆన్‌లైన్‌లో పేరు నమోదు కాని వారు శంషీగూడ వార్డు కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని, అధికారి మీ ఇంటి వద్దకు వచ్చి సర్వే చేసి, ఫొటో తీసుకుంటే సర్వే ముగిసినట్టని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ కాబట్టి ప్రజలందరు సమన్వయం పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఆఫీస్ అడ్మిన్ శ్రీనివాస్. సీఓ ముస్తఫా, ఆపరేటర్ ప్రభావతి, బిల్ కలెక్టర్ కుమార్, నాయకుడు గుడ్ల శ్రీనివాస్, రాజు గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామచంద్రుని శాంతి కల్యాణం



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఔటర్‌రింగు రోడ్డు శ్రీరామ్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో అష్టాదశ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శ్రీరాముని కల్యాణం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో చతుస్థానార్చనలు, మూలమంత్ర హోమాలు, గజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో అభయాంజనేయస్వామికి పూజలు ,అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు యాదవరావు, నర్సింగ్‌రావు, రమేష్, సహదేవ్, గోపాల్, బిల్డర్ శేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.